ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబరు 2024 | 5 | శ్రీకాకుళం



వర్మీ కంపోస్టు కొనుగోలు




ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా పంచాయతీ అధికారి నేతృత్వాన గ్రామ పంచాయతీల్లో తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ఎరువును ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి కొనుగోలు చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం' ప్రాంగణమైన జెడ్‌పి కార్యాలయం ఆవరణలో వర్మీ కంపోస్టు అమ్మకపు స్టాల్‌ను సోమవారం ఆయన సందర్శించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేతుల మీదుగా కొనుగోలు చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీదారులు కూడా ఈ స్టాల్‌లో వర్మీ కంపోస్టు కొనుగోలు చేశారు.

ఇక డిస్ట్రిబ్యూటరీల వంతు

- నేడు 16 కమిటీలకు ఎన్నిక
- అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్న నీటిసంఘాల అధ్యక్షులు
- ఓటర్లుగా హాజరు కానున్న 98 మంది ప్రెసిడెంట్లు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

జిల్లాలో ఈనెల 14వ తేదీన సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. జిల్లావ్యాప్తంగా 342 సంఘాలకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వారిలో కొంతమంది ఇప్పుడు వారి పరిధిలోని డిస్ట్రిబ్యూటరీ కమిటీల (డిసి) అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. సంఘాల ఎన్నికలకు సంబంధించి అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. డిస్ట్రిబ్యూటరీ సంఘం పేరుతో ఉన్న ప్రాంతంలోని ఓ వేదికను నిర్ణయించి ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


జిల్లాలోని 16 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు మంగళవారం ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆయా డిసిల కమిటీల పరిధిలోకి వచ్చే సాగునీటి సంఘాల అధ్యక్షులు డిసి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా ఇటీవల ఎన్నికైన 342 మంది సాగునీటి సంఘాల అధ్యక్షుల్లో డిస్ట్రిబ్యూటరీలు ఉన్న సంఘాల నుంచి 98 మంది అధ్యక్షులు ఓటర్లుగా హాజరు కానున్నారు. ఆమదాలవలస మండలంలో కొర్లకోట, పొందూరు మండలం తాడివలస, గోరింట, ఎచ్చెర్ల మండలం పొన్నాడ, శ్రీకాకుళం మండలం అరసవల్లి, జలుమూరు మండలం పర్లాం, నరసన్నపేట మండలంలో నరసన్నపేట, పోలాకి మండలంలో పోలాకి, సంతబొమ్మాళి మండలం గోవిందపురం, మేఘవరం, టెక్కలి మండలం నౌపడ, వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరు, శ్రీకాకుళం మండలం సింగుపురం, ఎల్ఎన్‌పేట మండలం ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలం సరుబుజ్జిలి, గార మండలం అంపోలు పేరుతో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి.

డిసిల వారీగా ఓటర్ల వివరాలు

కొర్లకోట-1, తాడివలస, గోరింట, పొన్నాడ, అరసవల్లి, జలుమూరు, పోలాకి డిసిలో ఐదేసి చొప్పున సాగునీటి సంఘాలు ఉన్నాయి. నరసన్నపేట, గోవిందపురం, మేఘవరం వజ్రపుకొత్తూరు, సింగుపురం డిసిలో ఏడేసి చొప్పున సంఘాలు ఉన్నాయి. నౌపడలో తొమ్మిది మంది, ఎల్ఎన్‌పేట డిసిలో పదేసి సంఘాలు చొప్పున ఉన్నాయి. సరుబుజ్జిలో మూడు సంఘాలు, అంపోలులో ఆరు సంఘాలు ఉన్నాయి. వీటి అధ్యక్షులే డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకోనున్నారు.

షెడ్యూల్ ఇలా...

ఉదయం 9 గంటలు : సర్వసభ్య సమావేశం
9 నుంచి 9.15 గంటలు : అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ, ప్రకటన
9.30 గంటలు : నామినేషన్ల తుదిజాబితా
9.30 నుంచి 10 గంటలు : అవసరమైతే ఎన్నిక ప్రక్రియ
10 నుంచి 10.30 గంటలు : లెక్కింపు, అధ్యక్షుని ఫలితం ప్రకటన
11 నుంచి 11.15 గంటలు : ఉపాధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ, ప్రకటన
11.15 నుంచి 11.30 గంటలు : నామినేషన్ల తుది జాబితా
11.30 నుంచి 12 గంటలు : అవసరమైతే ఎన్నిక ప్రక్రియ
12 నుంచి 12.15 గంటలు : లెక్కింపు, ఉపాధ్యక్షుని ఫలితం ప్రకటన



జిల్లాకు వర్ష సూచన

ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఆగ్నేయ బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనం ఏర్పడింది. రెండు రోజుల్లో ఇది మరింత బలపడుతుందని వాతావరణశాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 18వ తేదీన జిల్లాలో వర్షాలు పడతాయని తెలిపింది. వరుసగా సంభవిస్తున్న అల్పపీడనాల ప్రభావంతో రైతాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఇటీవల సంభవించిన అల్పపీడన ప్రభావంతో అక్కడక్కడా తేలికపాటి జల్లులు కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ సూచనలతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో ప్రస్తుతం నూర్పులు జరుగుతున్నాయి. ఈ సమయంలో వర్షాలు కురిస్తే తేమ శాతం పెరిగి ధాన్యం అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పవని రైతుల్లో గుబులు రేగుతోంది.


సదస్సులో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఉపాధ్యాయురాలిపై దాడి

బంగారం కోసం విఫలయత్నం

ప్రజాశక్తి - కవిటి

మండలంలోని చండిపుట్టుగ గ్రామ సమీపంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై సోమవారం ఉదయం దాడి ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని ముత్యాలపేటలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బల్లెడ భారతి పని సర్దుబాటులో భాగంగా బొర్రపుట్టుగ ప్రభుత్వ పాఠశాలకు అధికారులు వేశారు. స్వగ్రామమైన భైరిపురానికి బొర్రపుట్టుగ దగ్గర్లోనే ఉండడంతో ఆమె రోజూ విధులకు నడుచుకుంటూనే వెళ్తోంది. ఎప్పటిలాగే సోమవారం ఉదయం పాఠశాలకు వెళుతుండగా, చండిపుట్టుగ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆగంతకుడు తలపై రాయితో దాడి చేశాడు. దీంతో ఆమె కింద పడిపోవడంతో మెడలోని బంగారు గొలుసును దొంగిలించే ప్రయత్నం చేయగా, ఆమె ప్రతిఘటించింది. ఈలోగా స్థానికులు అటువైపు రావడం చూసిన నిందితుడు పరారయ్యాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన భారతిని స్థానికులు కవిటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పలాస తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవివర్మ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు భారతిని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పరామర్శించారు. ఎస్‌పి మహేశ్వర రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. స్థానిక పోలీసులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీ ప్రకాష్, సిపిఎస్ కన్వీనర్ జానకిరావు భారతిని పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పని సర్దుబాటులో భాగంగా మహిళా ఉపాధ్యాయులను వాహన సదుపాయం లేని ప్రాంతాలకు పంపించడం సరికాదన్నారు.

నిందితులను శిక్షించాలి : యుటిఎఫ్

ఉపాధ్యాయురాలు భారతిపై గుర్తు తెలియని వ్యక్తి దాడిని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మహిళా ఉపాధ్యాయులకు సరైన రక్షణ కల్పించాలని కోరారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


గాయపడిన భారతి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని రాగోలులో రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఉపాధి హామీలో కాలువలు, రోడ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కనెక్టివిటీ రోడ్లు కావాలని కోరిన వెంటనే కలెక్టర్ ప్రతిపాదనలతో వెంటనే మంజూరు చేస్తున్నామన్నారు. మండల, జెడ్‌పి సమావేశాల నుంచి తీర్మానాలు కోరుతున్నామని, వారు అందిస్తున్నారని తెలిపారు. మండలాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. గతంలో మంజూరైన అభివృద్ధి పనులను తాను నిలుపుదల చేయలేదని చెప్పారు. గతంలో నిర్మాణాలు చేసి బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్న వారు అధైర్యపడొద్దని, పనులు చేసిన ప్రతిఒక్కరికీ బిల్లుల మంజూరుకు తాను జవాబుదారీగా ఉంటానన్నారు. తొలి దశలో మంజూరైన రోడ్లన్నీ పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి అంబటి నిర్మల, ఎంపిటిసి సభ్యులు బలగ చెంగళరావు, సర్పంచ్ గేదెల చెంగళరావు, టిడిపి నాయకులు గేదెల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై సోలార్ రూఫ్ టాప్

ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్‌లను నిర్మించుకోవాలని ఎపి ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో పలు శాఖల ఉద్యోగులకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన కింద తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తామని చెప్పారు. సోలార్ వినియోగం, దాని ఉపయోగాలు తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించడం కోసం సోలార్ పెండార్స్ ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేసి రూఫ్ టాప్ ఏర్పాటుకి రిజిస్ట్రేషన్ కూడా చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో ఈనెల 17వ తేదీన అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహ విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ సోలార్ రూఫ్ స్టాల్స్‌ను సందర్శించి రూఫ్ టాప్ ఏర్పాటు కోసం నమోదు చేసుకోవాలని కోరారు.

విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ చేపట్టాలి

- తగ్గించిన ఆవుపాల ధరను పెంచాలి
- ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ డెయిరీలో అవినీతిపై విచారణ చేపట్టాలని, తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవనంలో సోమవారం నిర్వహించిన పాల రైతుల సదస్సులో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ రోజుకు తొమ్మిది లక్షల లీటర్ల పాలను రైతుల నుంచి సేకరిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి రోజుకు 1.50 లక్షల లీటర్ల పాలను రైతులు పోస్తున్నారని చెప్పారు. రైతులకు విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాల ధర లీటరుకు రూ.3 తగ్గించిందని తెలిపారు. మరోవైపు రైతులకు ఇచ్చే దాణా ధరను పెంచేసిందన్నారు. రెండేళ్లుగా రైతులకు చెల్లించాల్సిన బోనస్ ఇవ్వడం లేదని, ఇన్సూరెన్స్ సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. డెయిరీలో అవినీతి, రైతులకు చెల్లించాల్సిన ధర అంశాలపై విచారణకు ప్రభుత్వం హౌస్ కమిటీ వేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో డెయిరీ యాజమాన్యం తప్పులు సరిచేసుకుని రైతులకు న్యాయబద్ధంగా చెల్లించాల్సిన ధర ఇవ్వకుండా, అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారులు వెతుకుతోందన్నారు. రైతులను మభ్యపెట్టి అన్ని సౌకర్యాలు ఇస్తున్నట్లు, అవినీతి జరగనట్లు సంతకాలు సేకరిస్తున్నారని చెప్పారు. డెయిరీ పరిధిలోని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులను భయపెట్టి వారి ద్వారా రైతులతో సంతకాలు చేయిస్తున్నారన్నారు. యాజమాన్యం చేస్తున్న దుర్మార్గపు చర్యలను రైతులు గ్రహించాలన్నారు.

రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు మాట్లాడుతూ పాల రైతులకు తగ్గించిన ధరను తక్షణమే పెంచాలని, ప్రతి నాలుగు నెలలకు బోనస్ ఇవ్వాలని, దాణా రేటుపై 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెయిరీని 1964 సహకార చట్టంలోకి తిరిగి తీసుకురావాలన్నారు. డిమాండ్లను నెరవేర్చుకునేందుకు పాల రైతులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. డెయిరీ యాజమాన్యం ఒత్తిళ్లకు తలొగ్గి రైతులు సంతకాలు పెట్టవద్దన్నారు. పాల రైతుల డిమాండ్లపై ఈనెల 27వ తేదీన గార మండలం నిజామాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దసంఖ్యలో పాల రైతులు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వెలమల రమణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.చంద్రరావు, పాల రైతులు ఎం.ప్రసాద్, వెంకట్రావు, ఎల్.కృష్ణమూర్తి, రాంబాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు

- అరిణాం అక్కివలస గ్రామస్తుల ఫిర్యాదు
- వినతులు స్వీకరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 'మీకోసం'కు 49 వినతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

తమ ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా భవనాలను నిర్మిస్తున్నారంటూ ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస గ్రామస్తులు 'మీకోసం'లో సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస పంచాయతీ ఎన్‌హెచ్-16ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబరు 197.3లో గ్రామ సర్పంచ్ నుంచి రూ.50 వేలకు కొనుగోలు చేసిన ఓ వ్యక్తి అక్రమ నిర్మాణ పనులు చేపడుతున్నారని వారు వివరించారు. దీనిపై ఈ ఏడాది ఫిబ్రవరి 19న తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వ భూమి అని అధికారులు నోటీసులు అంటించినా అక్రమ నిర్మాణాలు ఆగడం లేదన్నారు. ఆక్రమణదారులతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తహశీల్దార్, విఆర్‌ఒలపై చర్యలు తీసుకోవాలని కోరారు. తమ ప్రాంతంలో వంద రోజులు గడుస్తున్నా సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి కావడం లేదంటూ శ్రీకాకుళం నగరం కొన్నావీధివాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు పూర్తి కాకపోవడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. తనను అన్యాయంగా సిఎఫ్ పోస్టు నుంచి తొలగించారంటూ పాతపట్నం మండలం రొతుపురానికి చెందిన డోల భాగ్యవతి ఫిర్యాదు చేశారు. తాను భర్తకు దూరంగా ఉంటున్నానని, తనకు రేషన్ సరుకులు తీసుకోనీయడం లేదని పెద్దపాడుకు చెందిన ఎం.లక్ష్మి ఫిర్యాదు చేసింది. తమ కుమారునికి వికలాంగ పింఛను అందించాలని పెద్దపాడుకు చెందిన బి.అప్పారావు వినతిపత్రం అందించాడు. ఇప్పటివరకు మానసిక వైకల్యం పింఛను పొందుతున్నాడని, దాని స్థానంలో వికలాంగ పింఛను అందించాలని కోరారు.

'మీకోసం' కు 49 అర్జీలు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో సోమవారం మొత్తం 49 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ విజ్ఞప్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ సూర్యప్రకాష్, జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, డిపిఒ కె.భారతీసౌజన్య, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నాపత్రాలతో ఉన్న ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది

ఎస్ఎ గణిత పరీక్ష వాయిదా

ప్రశ్నాపత్రం లీక్ కావడమే కారణం

ప్రజాశక్తి - టెక్కలి, ఆమదాలవలస

విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎస్ఎ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించాల్సిన గణితం పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్ష ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ పరీక్ష వాయిదా పడింది. ఎక్కడ లీక్ అయిందన్నది తెలియలేదు. దీంతో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు జరుగుతున్న పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. అప్పటికే విద్యార్థులు పరీక్షా కేంద్రంలోకి పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వాయిదా పడడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మంగళవారం నిర్వహించాల్సిన భౌతిక, రసాయన శాస్త్రం పరీక్ష మాత్రం యధావిధిగా జరుగుతుందని అధికారులు ఆదేశాల్లో పేర్కొన్నారు. వాయిదా పడిన గణితం పరీక్షను మళ్లీ 20వ తేదీన నిర్వహించనున్నారు. పాఠశాలల సముదాయాలకు చెందిన పాఠశాలల వద్ద ప్రశ్నాపత్రాలు నిల్వ ఉంచారు. ఏరోజుకారోజు చొప్పున ప్రశ్నాపత్రాలు ఆయా సముదాయాల పరిధిలోని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు తీసుకువెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో కొన్ని సముదాయాలకు చెందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలలకు ప్రశ్నాపత్రాలు ముందుగానే అందించారు. దీనికితోడు ఉదయం తొమ్మిది గంటలకే విద్యార్థి చేతిలో ప్రశ్నాపత్రం ఉండాల్సి ఉండడం వల్ల ముందుగానే ప్రశ్నాపత్రాలు ఆయా పాఠశాలలకు చేరవేశారు. ఈ క్రమంలోనే పేపర్ లీకేజీ అయి ఉండవచ్చనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఎ పరీక్షల ప్రశ్నాపత్రం లీక్ అయిందన్న కారణంతో ప్రశ్నాపత్రాలను భద్రపరచడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. బుధవారం నిర్వహించాల్సిన సైన్స్, సోషల్ ప్రశ్నాపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌సి సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

9వరకు ఎస్‌సి వర్గీకరణపై వినతుల స్వీకరణ

ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణపై విజ్ఞప్తులను జనవరి తొమ్మిదో తేదీ వరకు అందించవచ్చని వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఛైర్మన్, విశ్రాంత ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. సోమవారం జిల్లాలో ఆయన పర్యటించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయా షెడ్యూల్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న వర్గీకరణ వల్ల దళితులకు తీరని నష్టం వాటిల్లుతుందని ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్ తెలిపారు. విభజన అంశాన్ని జిల్లా యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తామనడం భావ్యం కాదని ఎంఆర్‌పిఎస్ నాయకులు దుర్గాప్రసాద్ చెప్పారు. వర్గీకరణ చేయకపోతే 59 ఉప కులాల్లో కొందరికి మాత్రమే లబ్ధి చేకూరుతుందని, అందువల్ల ఈ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని మాదిగ సంఘాల నాయకులు బోసు మన్మథరావు వినతిపత్రం అందజేశారు.

వర్గీకరణ పేరుతో ఎస్‌సిల మధ్య అంతరాలను తీసుకొచ్చి రిజర్వేషన్ అమలుకు తూట్లు పొడుస్తున్నారని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు శ్రీను, కంఠ వేణు, ఆర్.వేణుగోపాల్ తదితరులు విన్నవించారు. వర్గీకరణ అమల్లో భాగంగా ఆదిఆంధ్ర కులాన్ని ఎస్‌సి-డి జాబితాలో కొనసాగిస్తూ రిజర్వేషన్ శాతాన్ని ఒకటి కంటే ఎక్కువ శాతానికి పెంచాలని పి.ఎర్రయ్య, యాగంటి శివరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. వీరితోపాటు పలువురు తమ అభిప్రాయాలను వినతుల రూపంలో అందించారు.

అనంతరం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డితో కలిసి కమిషన్ ఛైర్మన్ పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా విస్తీర్ణం, ప్రస్తుత జనాభా, అందులో ఎస్‌సి ఉప కులాల జనాభా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్యాక్‌లాగ్ పోస్టు భర్తీ, ఉద్యోగుల శాతం, ఉపాధి కల్పన, ఎస్‌సి కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమశాఖలు అందిస్తున్న సహకారం, జెడ్‌పి, పంచాయతీరాజ్, మున్సిపల్, పోలీస్ కార్యాలయాల్లో అమలవుతున్న చట్టాలు, భద్రత తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై అధికారుల అభిప్రాయాలు, సూచనలను ఆయన స్వీకరించారు. ఎవరైనా తమ విజ్ఞప్తులను నేరుగా సమర్పించలేకపోయినా, గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయం, విజయవాడలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో మెమోరాండం ఇవ్వవచ్చని కమిషన్ ఛైర్మన్ తెలిపారు. omcscsubclassification@gmail.com ఈ-మెయిల్ ద్వారానూ సమర్పించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ విశ్వమోహన్ రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి
www.prajasakti.com

సుపరిపాలనే లక్ష్యం


కవిటి : మాట్లాడుతున్న డిఎల్‌పిఒ గోపీబాల

ప్రజాశక్తి- కవిటి

గ్రామ పంచాయతీల్లో సుపరిపాలనే లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, సిబ్బంది పనిచేయాలని డిఎల్‌పిఒ ఆర్.గోపీబాల అన్నారు. ఎస్‌డిజి థీమ్ రెండు రోజుల శిక్షణలో భాగంగా సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామస్థాయి నుంచే మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తోందని అన్నారు. దానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎపిఎం గోవింద్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒ కుప్పిలి ఫణీంద్రకుమార్ అన్నారు.


వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ రమేష్‌నాయుడు

స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించిన మండలస్థాయి అధికారులకు, సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సోమవారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో పాల్గొని మాట్లాడారు. పేదరిక నిర్మూలన, ఆకలి బాధలను నివారించి ఆహార భద్రతను కల్పించడం, నాణ్యమైన విద్య, వైద్యం, తాగునీరు, లింగ అసమానత్వం రూపుమాపడం వంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి మరింత సమర్థవంతంగా ప్రభుత్వ విధానాలు అమలు పర్చాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి జె.ఆనందరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులకు అధికారులకు పంచాయతీ అభివృద్ధిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామారావు, ఎంఇఒ అప్పారావు, గ్రామీణ నీటి సరఫరా ఎఇ కె.విష్ణుకుమార్, ఎఒ భార్గవి, డాక్టర్లు వెచ్చ సంతోష్, ప్రదీప్‌కుమార్, డిఎల్‌పిఒ గోపీబాల, ఐసిడిఎస్ పిఒ పుష్పలత, నిర్మల పాల్గొన్నారు.

మందస : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఎంపిడిఒ పి.సూర్యనారాయణ ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు.

నందిగాం : పంచాయతీల ప్రగతిపై సర్పంచ్‌లు, అధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ టి.రాజారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కె.గోపీనాథ్, లక్ష్మణరావు, ఎఒ ధనలక్ష్మి, ఎంఇఒ జి.నర్సింహులు, కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, రమణబాబు, ఎర్ర జోత్స్న పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వం నిర్దేశించిన 9 అంశాలతో కూడిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపిడిఒ వసంతకుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, వెల్ఫేర్ సహాయకులు, గ్రామ సర్వేయర్లకు, అగ్రికల్చర్ సహాయకులకు, ఎఎన్‌ఎంలకు పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తీర్ణాధికారి మెట్ట వైకుంఠరావు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎపిఒ శంకరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనకు కృషి చేయాలని ఇఒపిఆర్‌డి వసంతకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 9 అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, ఎపిఎం లలితకుమారి, ఎంఇఒలు సిహెచ్.గోవిందరావు, ఎన్.శ్రీనివాస్, సూపర్‌వైజర్ లింగాల శాంతికుమారి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు ముందుకు సాగాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు, సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి 9 అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.తిరుమలరావు, ఎపిఎం జి.ప్రసాదరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లత పాల్గొన్నారు.

లావేరు : స్థానిక సంస్థలు, హక్కులు, బాధ్యతలపై ప్రజాప్రతినిధులు, కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఎంపిడిఒ పి.వెంకటరాజు అన్నారు. సోమవారం వెలుగు కార్యాలయంలో జరిగిన జిపిడిపి ప్లాన్‌లో భాగంగా సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలు పరిపాలన, హక్కులు, పరిమితులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మౌలిక వసతులు కల్పన, ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వి.విశ్వేశ్వరరావు, ఎఒ సునీత, ఎపిఎం సుబ్బయ్య నాయుడు, సచివాలయం, వెలుగు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


లావేరు : శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరాజు

పొందూరు: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఒ మీసాల మన్మథరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి ప్రారంభించిన నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎఒ మిశ్రా, అధికారులు, శిక్షణా సిబ్బంది పాల్గొన్నారు.


కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్


రైతులపై కందిరీగల దాడి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని కోటబొమ్మాళి పంచాయతీ బంజీరుపేటకు చెందిన పలువురు రైతులపై సోమవారం కందిరీగలు దాడి చేశాయి. రైతులు పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నారు. గ్రామ సమీపంలోని తోట వద్ద కందిరీగలు వారిపై దాడి చేశాయి. వెంటనే వారికి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్సను అందించారు. రెండు రోజులు క్రితం తోటకు వెళ్లిన గొర్రెల, మేకల కాపర్లపై దాడి చేశాయని, సోమవారం పొలం పనులు ముగించుకొని ఆదరబాదరగా ఇంటికి వస్తున్న సమయంలో కందిరీగలు తమపై దాడి చేశాయని గ్రామానికి చెందిన రైతు శిమ్మ తవిటిరాజు తెలిపారు.

జూనియర్ వెటర్నరీ మృతి

నందిగాం : మండలంలోని నర్సిపురం వెటర్నరీ ఆస్పత్రిలో జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేస్తున్న బి.సింహాచలం (61) ఆదివారం రాత్రి మృతి చెందారు. శనివారం విధులు నిర్వహించుకుని స్వగ్రామం చిన్నలావునిపల్లిలో నిద్రించారు. రాత్రి సమయంలో గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందారు. మృతుడికి భార్య వనజాక్షి, కుమారుడు నవీన్ ఉన్నారు.


సింహాచలం (ఫైల్)

ప్రభుత్వ డిగ్రీ అధ్యాపక సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఢిల్లీశ్వరరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ డిగ్రీకళాశాలల అధ్యాపక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా శ్రీకాకుళం పురుషుల డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్.ఢిల్లీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం జరిగిన జాతీయస్థాయి 37వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్రస్థాయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుత జోన్ అధ్యక్షునిగా కొనసాగుతున్న ఆయనను రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించారు.


ఢిల్లీశ్వరరావు


వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంఇఒ సిహెచ్.గోవిందరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్లౌజులు, చీపుర్లు, యూనిఫారాలను అందజేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.భవాని, పద్మ, లక్ష్మి, వెంకటమ్మ, శాంతి పాల్గొన్నారు.

ప్రవీణ్ నాయక్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ప్రవీణ్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన సంతాప సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ నాయక్ కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని, అలాగే ప్రవీణ్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ఈ సంతాప సభలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదల రవి, వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ప్లాస్టిక్ వాడితే చర్యలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని టీ, టిఫిన్ దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా విడనాడాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని మున్సిపల్ హెల్తాఫీసరు డాక్టర్ సుధీర్ హెచ్చరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం టీ, టిఫిన్ దుకాణదారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, అనారోగ్య సమస్యలను వివరించారు. టీ కోసం వాడుతున్న పేపరు కప్పులకు బదులుగా స్టీల్, గాజు గ్లాసులను వినియోగించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా ప్లాస్టిక్ సంచులు పట్టుబడితే చట్టపరిధిలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్

ఫిర్యాదులకు పూర్తిస్థాయిలో పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారణ జరిపి పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 62 ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేసి తక్షణమే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు. ఈ క్రమంలో నడవలేని వృద్ధులు, వికలాంగుల వద్దకు ఎస్‌పి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు.


ఫిర్యాదుదారుల సమస్యను వింటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ధరల నియంత్రణలో విఫలం

మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- పాతపట్నం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్య ప్రజలపై నిత్యవసర సరుకుల ధరలపై భారం మోపుతోందని, దీనిని నియంత్రించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో పాటుగా పేదలపై నిత్యవసర సరుకులు ధరలు పెంచడంతో అవస్థలు పడుతున్నారని అన్నారు. అలాగే ట్రూ ఆప్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని, సంక్షేమ పథకాలూ అమలు కావడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై మహిళలు, రైతులు, యువత, ఉద్యోగులు అసంతృప్తిలో ఉన్నారని అన్నారు.



రైస్‌మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పలాస: మందస రైస్ మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మందస మండల నాయకులు కె.కేశవరావులు డిమాండ్ చేశారు. చైతన్య రైస్, ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి ఆర్‌డిఒ వెంకటేష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైస్ మిల్లు యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య ప్రతి రెండేళ్లకోసారి వేతన ఒప్పందం ఉందన్నారు. గడువు పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా వేతన ఒప్పందం అమలు కావడం లేదన్నారు. ఆరు నెలలుగా రైస్ మిల్లు యజమాన్యాలు కాలయాపన చేస్తూ... కార్మికులను ఇబ్బందులు పెడుతున్నాయని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్‌లు, గ్రాడ్యూటీ, వెల్ఫేర్ వంటి సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బి.వెంకటేశం, పి.కూర్మారావు, బి.మల్లేష్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కవిటి

ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ ఎన్నికలో గౌరవాధ్యక్షునిగా జి.వీరభద్రస్వామి, సలహాదారుగా మూల మోహనరావు, అధ్యక్షుడిగా నెమలపురి మన్మథరావు, ఉపాధ్యక్షునిగా పి.జ్యోతిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా రత్నాల చంద్రశేఖర్, కోశాధికారిగా అబ్దుల్ ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మామిడి హరికృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.రూప, ఆఫీస్ బేరర్లుగా ఎన్.గుణవతి, కె.రవిబాబు, ఎ.విజయ్ కుమార్, జి.చిన్నారి, రమేష్ బెహరా ఎన్నికయ్యారు. వీరికి ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.


సోంపేట : నియామకపత్రం అందుకుంటున్న శాంతికుమారి

నందిగాం : మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన అధ్యక్షునిగా కుప్పిలి సంతోష్‌కుమార్ ఏకగ్రీవ ఎన్నికయ్యారు. మండల పరిషత్ ప్రాంగణంలో సోమవారం కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వై.జోత్స్న, కోరాడ రమణబాబు, జనరల్ కార్యదర్శిగా ఈగల లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శిగా ఎ.ఉమాపతి, కోశాధికారిగా కె.గోపీనాథ్, కార్యవర్గ సభ్యులుగా మరో ఐదుగురు ఎన్నుకున్నారు.

సోంపేట : మండల పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన అధ్యక్షురాలిగా ఇఒపిఆర్‌డి శాంతకుమారి ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ ఈశ్వరమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షునిగా పి.ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వరలక్ష్మి, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.మధు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్వప్న, ఆఫీస్ బేరర్‌గా ఎస్.నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు ముఖ్య సలహాదారుగా లక్ష్మణమూర్తిని, మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు శాంతకుమారి మాట్లాడుతూ సంఘ అభివృద్ధితో పాటు, సభ్యుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.


కవిటి : ఎన్నికైన కార్యదర్శుల నూతన కార్యవర్గం

ఎంపీ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం నియోజకవర్గ స్థాయి వేడుకల సన్నాహక సమావేశం నగరంలోని ప్రజాసదన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో పండగ వాతావరణంలో ఈ వేడుకలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్‌లతో పాటు గ్రామీణ ప్రాంతం నుంచి పెద్దఎత్తున ఈ వేడుకల్లో అభిమానులు, టిడిపి కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే మసీదు, చర్చి, ఆలయాలను సందర్శించి పలు సేవలు నిర్వహించాలన్నారు. అన్నదాన కార్యక్రమాలు, దుస్తుల పంపిణీ ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కళింగ కోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి నాయకులు చౌదరి బాబ్జి, పట్టణ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, శీర రమణయ్య, అరవల రవీంద్ర, మాజీ ఎంపిపి గొండు జగపతి, కొర్ను నాగార్జున, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే టిడిపి కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ పోతనపల్లి సాంబమూర్తి అన్నారు. మండలంలోని రాజాం పంచాయతీ ధర్మపురంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెపండగాలో భాగంగా ఉపాధి హామీ నిధులు రూ.60 లక్షలతో పంచాయతీ పరిధిలో 985 మీటర్లు పొడవుతో ఐదు రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజశేఖర్, దానయ్య, కోనేరు లోకేష్, ఎం.వీరాస్వామి, కొల్లి గణపతి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న సాంబమూర్తి

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ఆమదాలవలస: చేపలు, రొయ్యలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే మంచి ధర లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో చేపలు, రొయ్యలు పెట్టుబడి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేపలు, రొయ్యలు పరిశుభ్రంగా ఉంటే మార్కెటింగ్ సౌకర్యాలు పెరుగుతాయన్నారు. చేపలతో అనేక రకాల విలువ ఆధారిత ఉత్పత్తులు చేయడం ద్వారా నాణ్యమైన చేప ఉత్పత్తులు వినియోగదారులకు అందించవచ్చునన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ, కె.వీరాంజనేయులు, బి.కోటేశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ భాగ్యలక్ష్మి

బాధితులకు అండ


బాధితులకు సాయం అందజేస్తున్న ప్రతినిధులు

పొందూరు: మండలంలోని కోటిపల్లిలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు సోమవారం శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, పొందూరు యంగ్‌స్టార్స్ యూత్ క్లబ్ సంయుక్తంగా సాయం అందజేశారు. సుమారు రూ.50 వేలు విలువ చేసే వంట పాత్రలు, బట్టలు, బియ్యం, పప్పు దినుసులు, వంటనూనె ఇతరత్రా సామగ్రిని నాలుగు అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ సుమారు రూ.ఏడువేలు విలువచేసే కిట్లును పంపిణీ చేశారు. ఆర్థికసాయం అందించిన వారిలో బాషా ఆనందమోహన్, వడగ మనోరమ, జామి అనీల్, నాని, నానాజీ తదితరులున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురగుబెల్లి సుధారాణి, మాజీ ఎంపిటిసి రమణ, యంగ్‌స్టార్ యూత్ క్లబ్ అధ్యక్షుడు కాళ్లకూరి శాంతారాం, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు చైతన్య, పవన్, రమణ, గోపి, స్థానికులు వినయ్‌కుమార్, కాటరాజు, పెరుమాలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసంస్థ సాయం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు శ్రీకాకుళం సత్యసాయి సేవా సంస్థలు సోమవారం సహాయం అందించారు. బియ్యం, వస్త్రాలు, దుప్పట్లు, వంట పాత్రలు, కిరాణా సామగ్రి తదితర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, పప్పల నాగేశ్వరరావు, బోయిన నరసింహారావు, సర్పంచ్ గురుగుబెల్లి సుధారాణి, సత్యసాయి సేవాదళసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

మహిళ దారుణ హత్య

పరారీలో నిందితుడు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజుల కొల్లివలస దరిలో ఉన్న వంశధార నిర్వాసిత ఆర్‌ఆర్ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు... ఈ హత్య అక్రమ సంబంధం, ఆర్థిక లావాదేవీల కారణంగా జరిగినట్లు తెలుస్తుంది. నిర్వాసిత కాలనీకి చెందిన దామోదర పద్మ (35) అనే మహిళ అదే గ్రామానికి చెందిన సొండి సురేష్ చేతిలో హత్యకు గురయినట్లు పోలీసులు, స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ హత్యకు ప్రధానంగా వివాహేతర సంబంధం, ఆర్థిక లావాదేవీలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు సురేష్ ప్రస్తుతం భవానీ మాలలో ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. పోలీసులకు దొరక్కుండా ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. హత్యకు గురైన పద్మ గత కొంతకాలంగా తన ఇద్దరు కుమార్తెలతో కలిసి నిర్వాసిత ఆర్‌ఆర్ కాలనీలో చిన్న పాన్‌షాపు నిర్వహిస్తూ నివాసం ఉంటుంది. పద్మ భర్త కృష్ణ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. భర్త మృతి చెందడంతో పద్మ తన కుమార్తెలను చదివించుకుంటూ జీవనం సాగిస్తుంది. మృతురాలుకు ఇంటర్, పదో తరగతి చదువుతున్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పద్మ పక్కింటిలో ఉన్న సురేష్‌తో పరిచయం ఏర్పడడంతో కలిసి మెలిసి ఉండేవాళ్లని, భర్తలేని పద్మకు అన్నీ తానై సురేష్ చూసుకునేవాడని స్థానికులు చెబుతున్నారు. పద్మ ఇటీవల వేరే వ్యక్తితో తరచుగా మాట్లాడడం చూసిన సురేష్ ఆమెపై కక్ష పెంచుకుని, ఆదివారం రాత్రి పద్మ ఇంటికి వెళ్లి తలుపులు కొట్టడంతో ఆమె తలుపులు తీసిందని, దీంతో సురేష్, పద్మ కాసేపు ఘర్షణ పడినట్లు సమాచారం. సురేష్ తన వెంట తెచ్చుకున్న కత్తితో పద్మ ఛాతిపై పొడవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘర్షణకు నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు లేచి రక్తపు మడుగులో పడి ఉన్న తల్లిని చూసి వెంటనే కేకలు వేయడంతో నిందితుడు సురేష్ అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ కె.వెంకటేష్ కేసు నమోదు చేయగా సిఐ పి.సత్యనారాయణ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.


పద్మ మృతదేహం


పద్మ (ఫైల్)

రెండు నెలల క్రితమే నిందితుడిపై కేసు పెట్టిన పద్మ !

పద్మ రెండు నెలల క్రితమే పోలీస్‌స్టేషన్లో సురేష్‌పై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీల కారణంగా పద్మ, సురేష్‌ల మధ్య తగాదా జరగడంతో సురేష్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు. అప్పట్లో పోలీసులు ఇరువురిని పిలిచి మందలించి పెద్దల సమక్షంలో రాజీ కుదిర్చినట్లు సమాచారం.

నిందితుడి కోసం పోలీసుల గాలింపు

హత్య కేసులో నిందితుడిగా భావిస్తున్న సురేష్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. హత్య జరిగిన ఆర్‌ఆర్ కాలనీకి వెనుకవైపున ఉన్న సంగమేశ్వర స్వామి కొండపై నిందితుడు ఉన్నట్లు ఫోన్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. డ్రోన్ కొండపైకి ఎగరవేయగా డ్రోన్ చిత్రాల్లో కనిపించినట్లు సమాచారం.

యాచకుడు హత్య

ఇచ్ఛాపురం: మండలంలోని లొద్దపుట్టిలో ఉన్న తులసమ్మ ఆలయ సమీపంలో భిక్షగాడు పట్టా స్వామి (60)ని దుండగలు ఆదివారం హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్వామి ఆలయం భిక్షాటన చేసుకుని సమీపంలో నిద్రిస్తూ... జీవనం సాగించేవాడు. రోజూలానే ఆదివారం రాత్రి నిద్రించగా... గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో తలపై కొట్టి హతమార్చారు. ఉదయం అటుగా వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. సిఐ మీసాల చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. భిక్షగాడిని హత్య చేయడంతో పట్టణంలో సంచలనం కలిగించింది.


స్వామి మృతదేహం

యువకుడు ఆత్మహత్య

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిదిలో గల లెప్పర్సీ కాలనీలో నివాస ఉంటున్న శంకర్ (23) సోమవారం ఉదయం ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శంకర్ ఇటీవలే ఓ వివాహితను రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో పాటే కంపోస్టు కాలనీలో నివాస ముంటున్న మృతుడు తరచూ ఇంట్లో ఆమెతో గొడవ పడుతుండే వాడని, ఎప్పటిలాగే ఆదివారం రాత్రి కూడా ఇద్దరు గొడవ పడ్డారని స్థానికులు చెబుతున్నారు. ఇద్దరు గొడవపడి ఆమె రాత్రి ఇంట్లోనుంచి వెళ్లి పోయిందని, మనస్థాపంతో శంకర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెపుతున్నారు. పోలీసులకు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

17 మద్యం సీసాలు పట్టివేత

కొత్తూరు : మండలంలోని నివగాంలో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ స్థానిక షాపుల్లో సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖలో 17 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. అక్రమంగా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎస్ఐ

పుస్తెలతాడు చోరీ

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురానికి చెందిన లండ నీలవేణి బైక్‌పై సోమవారం కవిటి వెళ్తుంది. ఈదుపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడ నుంచి మూడు తులాల పుస్తెలతాడు అపహరించాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెల్లుపడకు చెందిన నీలవేణి, తమ కుమార్తెతో కలిసి కవిటి మండలంలోని ఉన్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ వద్దకు వెళ్తున్నారు. అయితే ఈదుపురం సమీపంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి బైక్‌పై వచ్చాడు. నీలవేణి బైక్‌ను ఆపి కవిటి మండలానికి ఎలా వెళ్లాలని అడిగాడు. నీలవేణి ఆ వ్యక్తికి ఇటు వెళ్లాలని చెప్పు తుండగా... ముందస్తు పథకం వేసుకున్న ఆయన హఠాత్తుగా ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడునులాక్కొని బైక్‌పై పారిపోయాడు. దీంతో నీలవేణికి ఒక్కసారి నోట్లో మాట రాలేక దిగ్భ్రాంతి చెందింది. ఆ వెంటనే తేరుకుని కేకలు వేసింది. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



సంతబొమ్మాళి : వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ అన్నారు. మండలంలోని మేఘవరం, మరువాడ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముటేషన్, కరక్షన్, రైతు ఖాతాలకు ఆధార్, మొబైల్ నంబరు నమోదుకు రైతులు దరఖాస్తులు చేస్తే 60 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలపై వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసన్న, విఆర్ఒ పి.వి.రమణ, సర్వేయర్ సిహెచ్.రామారావు, ఢిల్లేశ్వరరావు, హేమసుందర్, మేఘవరం సర్పంచ్ ప్రతినిధి పరపటి శ్రీనివాస్‌రెడ్డి మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్‌రెడ్డి, మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని తెంబూరు సచివాలయంలో సర్పంచ్ బెనియో వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కిరణ్ కుమార్ రైతుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అలాగే పెద్దలక్ష్మీపురం పంచాయతీలో సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ వివాదాలు, సరిహద్దు, మ్యూటేషన్, ఆక్రమణలు తదితర సమస్యల అర్జీలను స్వీకరించారు.కార్యక్రమంలో పెద్దలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి రోణంకి అన్నారావు, సెక్రెటరీ సిమ్మన్న, విఆర్ఒ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస: గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం వలన రైతులకు ఎంతో మేలు కలుగుతుందని తహశీల్దార్ పి.రాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని కొర్లకోట గ్రామ సచివాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనాల కోసం నిర్వహించే ఈ సదస్సులను ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. భూ రికార్డుల్లో ఎటువంటి తప్పులు ఉన్నా తగిన ఆధారాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న రైతు సమస్యలపై టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, పేడాడ సూరప్పనాయుడు, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎన్నోఏళ్లుగా పరిష్కారంకాని ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ పప్పల గోవిందరావు, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఆమదాలవలస : వినతిపత్రం స్వీకరిస్తున్న తహశీల్దార్



టిసిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

టిసిలకు అభినందనలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో ఇటీవల నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలకు 17 సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సోమవారం అభినందిస్తూ... సన్మానించారు. ఈ సందర్భంగా మెళియాపుట్టి నీటి సంఘం అధ్యక్షులు అనపాన రాజరత్నం, మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్ రెడ్డి ఎమ్మెల్యేకు మెమెంటో అందజేసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు చంద్రశేఖర్, సర్పంచ్ ప్రతినిధులు మాలతి శ్రీధర్, బమ్మిడి భాస్కరరావు, రేఖాన వాసు, శ్రీనివాసరెడ్డి, రవీంద్రజన్నా పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ గిరిబాబు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పలాస : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పలాస-కాశీబుగ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్, మహారాణిపేట తదితర ప్రాంతాల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎన్.రామారావు, ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లోడగల కామేశ్వరరావు, గొల్ల చంద్రరావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కోటేశ్వరరావు, రమేష్

స్థలం మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణా కేంద్రానికి స్థలం మంజూరు చేయాలని యోగ సాధకులు ఎ.కోటేశ్వరరావు, కె.రమేష్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పాతపట్నంలో శిక్షణా కేంద్రం నిర్వహించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి స్థలం మంజూరుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

అభివృద్ధికి ఐక్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఒ ఎల్.ఎస్.డి.జిపై శిక్షణా తరగతులు నిర్వహించారు. అందులో భాగంగా ఆరోగ్య అంశాలపై ఎంపిహెచ్ఇఒ బి.లింగమూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి, మండల సర్పంచ్‌లు, ఉన్నతాధికారులు, కార్యదర్శులు, గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపిడిఒ వారికి సూచించారు.



అభినందిస్తున్న కౌన్సిలర్లు

వైద్యాధికారి నియామకం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం అర్బన్ హెల్త్ సెంటర్‌కు వైద్యాధికారి ఎ.జూహితాను ప్రభుత్వం నియామకం చేపట్టింది. నూతనంగా బాధ్యతలను చేపట్టిన వైద్యాధికారిని వార్డు కౌన్సిలర్ సిగ్గు ప్రేమ్‌కుమార్, రెండో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆస్పత్రి అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో దనపాన కేశవరావు, దనపాన మాధవరావు, నెయ్యల రాజేష్, వైద్య సిబ్బంది కుమారి, జయశ్రీ, కేశవ, దామోదరరావు, నారాయణరావు, ధనలక్ష్మి, వనజ, శాంతికుమారి, ఎరమ్మ, ఆశా వర్కర్లు గుణవతి, జ్యోతి ఆపల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి

కవిటి మండల పరిసర ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న గొలుసు దొంగల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలని మండలం ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు ఎస్ఐ రవివర్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చండిపుట్టుగ సమీపంలో మహిళా ఉపాధ్యాయినిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, చోరీకి ప్రయత్నించిన అగంతకుడిని పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

న్యాయం జరిగే వరకు పోరాడుతాం

ప్రజాశక్తి- కవిటి

తమకు శాశ్వత తరగతి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి, తమ బిడ్డలకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని బెంతు ఒరియా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సుమన్ బిసాయి అన్నారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు సోమవారానికి 356వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు కుల ధవీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు తమ విలువైన అవకాశాలు కోల్పోయి, వెనుకబాటుకు గురవుతున్నారని అన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడిన బెంతు ఒరియా మహిళలు చాలా వరకు ప్రభుత్వ పథకాలకు దురమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైన తమకు ఇచ్చిన హామీ మేరకు తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బృందావన్ బిసాయి, ప్రసాద్ పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు

'జెస్సి ఈవెంట్స్'కు సత్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న ఢిల్లీరావు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బొడ్డపాడుకు చెందిన జెస్సి ఈవెంట్స్‌కు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇష్కుప్) విశాఖ సమితి, రాష్ట్ర జానపద సంఘం సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర జానపద మహోత్సవానికి ఆహ్వానం పలికింది. ఈ మేరకు బహుకరించిన ప్రదర్శనను అభినందిస్తూ జెస్సి ఈవెంట్స్ కళాబృందాన్ని సత్కరించారు. ఇష్కుప్ జాతీయ ప్రధాన కార్యదర్శి బిజియకుమార్ పడహారి ఇంతటి సదా అవకాశం కల్పించిన రాష్ట్ర జానపద సంఘం ప్రధాన కార్యదర్శి కుమార్ నాయక్, అధ్యక్షులు ఎల్.ఆర్.కృష్ణబాబు జెస్సి ఈవెంట్స్ ఆర్గనైజర్ కిక్కర ఢిల్లీరావు అభినందనలు తెలిపారు.

కుమార్ నాయక్‌కు సత్కారం

విశాఖ పౌర గ్రంథాలయంలో రాష్ట్రస్థాయి జానపద కళా ఉత్సవాల్లో పలాసకు చెందిన ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్ నాయక్‌ను సత్కరించి బహుమతిని ప్రదానం చేశారు. దీంతో కళాకారులు అభినందించారు.

వైద్య శిబిరానికి స్పందన

లావేరు: ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి అప్పుడప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించు కోవాలని బెజ్జిపురం యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు అన్నారు. సోమవారం బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం మహాభాగ్యం అని అప్పుడప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవడం ఉత్తమం అన్నారు. పలువురుకి వైద్య పరీక్షలు నిర్వహించి శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.రమణ, జి.క్రాంతి కుమారి, సోని, జయరాజ్, యూత్‌క్లబ్ సభ్యులు ఇజ్జడ అప్పారావు, గంట్యాడ అప్పలనాయుడు, కె.వెంకట ధర్మారావు, విశ్వనాథం, సన్యాసినాయుడు తదితరులున్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పింఛను మంజూరు చేయాలి

టెక్కలి : భర్త చనిపోయి వితంతుగా తనకు పింఛను మంజూరు చేయాలని పట్టణానికి చెందిన పి.కాంతమ్మ, జయకృష్ణాపురానికి చెందిన ఎం.జయలక్ష్మిలు కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సోమవారం నిర్వహించిన మీకోసంలో కలిసి వినతిపత్రాలను అందజేశారు. అలాగే తలగాంకు చెందిన రోణంకి ధనలక్ష్మి మరుగుజ్జు కావడంతో గతంలో సదరన్ ధ్రువపత్రం మంజూరు చేసిన పత్రాన్ని రద్దు చేసి కొత్తగా మరో ధ్రువపత్రం మంజూరు చేయాలని కోరారు. టెక్కలి పట్టణం బాలాజీనగర్ ప్రాంతానికి రోడ్డు లేకపోవడంతో 20 కుటుంబాల వారు రాకపోలకు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. వివిధ సమస్యలపై 15 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు దరఖాస్తులు పంపినట్లు ఆర్‌డిఒ తెలిపారు.



సన్మానిస్తున్న పారిశుధ్య కార్మికులు

రూ.30 వేలు ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులుగా నిరంజన్ లిమ్మయి ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు అందలేదు. తమతో కలిసి ఎంతో కాలంగా పనిచేస్తూ... ఉద్యోగ విరమణ పొందడంతో తోటి కార్మికులు రూ.30 వేలు చందాలు వేసుకుని సోమవారం అందజేశారు. అనంతరం దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సిఐటియు నాయకులు రమేష్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి- పొందూరు

మండలం మలకాం ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతూ అనారోగ్యానికి గురైన 6 వ తరగతి విద్యార్థి అదపాక దేవి వరప్రసాద్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. కొన్ని రోజుల క్రితం సైకిల్ తొక్కుతూ క్రింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చేరిన విద్యార్థికి శస్త్రచికిత్స అవసరమైంది. దేవీవరప్రసాద్ కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికసాయానికి ముందుకు వచ్చారు. రూ.25 వేలు సేకరించి విద్యార్థి కుటుంబానికి సోమవారం అందించారు. దాతలు విద్యార్థి వైద్యానికి సహాయం అందించాలని ఉపాధ్యాయులు కోరారు.

బ్యాంకు సేవలపై అవగాహన

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేసినల్ విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్‌లో జర్జంగి వికాస్ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సిహెచ్.అనిల్‌కుమార్, సిబ్బంది బి.చంద్రశేఖర్‌లు బ్యాంకు సేవలపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సంతోషి, అధ్యాపకులు పి.రాజసురేష్, డి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్